## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): డీ–13 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ మానస సరోవరం ఎస్ఎస్‌లో కన్‌స్ట్రక్షన్స్ పనుల కారణంగా 11 కేవీ లోకల్ 3, 9వ ఫీడర్స్‌కు విద్యుత్ సరఫరా గురువారం నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహెచ్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. నందివెలుగు రోడ్, రాహుల్ గాంధీ నగర్, జియావుద్దీన్ నగర్ తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### నేడు అంగన్‌వాడీల జిల్లా మహాసభ

లక్ష్మీపురం: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు జి.రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభ గురువారం పాతగుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ హాజరవుతారని చెప్పారు.

### ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



గుంటూరు మెడికల్: జీఎస్టీ స్లాబ్ తగ్గించడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణ ఎన్నికల్లో విజయంపై విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకుడని పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేట నుంచి శంకర్ విలాస్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

### 22 నుంచి నవరాత్రులు ప్రారంభం



నగరంపాలెం: కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22 నుంచి 104వ దేవి నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కోట శేషగిరి అన్నారు. ఆర్.అగ్రహారం అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఉత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అమ్మవారికి అలంకారాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది రోజులు ఉదయం ఏడున్నర నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి పదిన్నర వరకు అమ్మవారిని దర్శించుకోవచ్చునని ఆయన భక్తులకు తెలిపారు. వచ్చే నెల 2వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా చేపడతామని అన్నారు. కార్యక్రమంలో కొనకళ్ల సత్యం, వనమా నరేంద్ర, దేవేంద్రగుప్తా, శేఖర్, కారంశెట్టి లోకేష్, సాగర్, కొత్తూరి వెంకట్, సముద్రాల గణేష్ పాల్గొన్నారు.

### గణేశ్ ఉత్సవాల్లో భాగంగా అన్నదానం



పట్నంబజారు: నగరంలోని 2వ డివిజన్ సీతానగర్ నాలుగో లైనులో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీన్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూరిఫాతిమాను చవితి పందిరి నిర్వాహకులు దుశ్శాలువతో సత్కరించార

### 13న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఏకా పవన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ కార్యక్రమంలో కోర్టు పరిధిలోని కక్షిదారులు రాజీపడదగిన క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులు వంటివి రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

# కొలిక్కి రాని మార్కెట్ పంచాయితీ

- కొల్లి శారద మార్కెట్‌కు రాకుండా సరుకును తరలిస్తున్న రైతులు
- బైపాస్‌లో మార్కెట్ నిర్వహణకు అనుమతులు లేవంటున్న అధికారులు



కొల్లి శారద మార్కెట్ లోపల ఖాళీగా దర్శనమిస్తున్న షాపులు

నెహ్రూనగర్: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ పంచాయితీ కొలిక్కి రాలేదు. పాత లీజుదారులు మార్కెట్‌ను పొన్నూరు రోడ్డు(బైపాస్) వద్ద ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న క్రమంలో కొల్లి శారద మార్కెట్‌కు రైతులు రాని పరిస్థితి. కొలి శారద మార్కెట్ మీద ఆదాయం వస్తుందనే ఆశతో లక్షలు ఖర్చుపెట్టి బహిరంగ వేలంపాటలో షాపులను దక్కించుకున్న కొత్త లీజుదారులకు రైతులు మార్కెట్‌కు రాకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు.

**అనుమతులు లేకుండా కుదరదు...**

మార్కెట్లు నిర్వహించాలంటే 16 శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు చెబుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మార్కెట్ నిర్వహించకూడదని ఇటీవల రెవెన్యూ అధికారులకు పాత లీజుదారులకు చెప్పినప్పటికి వారు వినకుండా అక్కడే వ్యాపారాలు చేసుకుంటున్నారు. వ్యాపారం చేసుకోవడానికి దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తామని చెబుతున్నా వారు దరఖాస్తు చేసుకోవడం లేదని అధికారులు చెబుతున్నారు.

**లక్షలు ఖర్చుపెట్టి షాపులు దక్కించుకున్నా..**

కొల్లి శారదా మార్కెట్‌లో 81 షాపులకు 25 ఏళ్ల లీజుగడువు పూర్తవడంతో గత నెల 18, 19, 20వ తేదీల్లో బహిరంగ వేలం నిర్వహించారు. మార్కెట్ మీద మంచి ఆదాయం వస్తుందని చాలా మంది కొత్త వారు బహిరంగ వేలంలో ఒక్కో షాపు మీద రూ.లక్షలు వెచ్చించి షాపులను దక్కించుకున్నారు. దీని వలన కార్పొరేషన్‌కు రూ.6 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. అయితే పాత లీజుదారుల నుంచి షాపులను స్వాధీనం చేసుకునే సమయంలో వారంతా అధికారులపై అడ్డం తిరిగిన నేపథ్యంలో పోలీసుల సహకారంతో షాపులను స్వాధీనం చేసుకుని తాళాలు వేసుకున్నారు. పాత లీజుదారులంతా రైతులందరిని బైపాస్ వద్దకు పిలిపించుకుని అక్కడే వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవడంతో ఇక్కడ కొల్లి శారద మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగకపోవడంతో కొత్త లీజుదారులంతా తలలు పట్టుకుంటున్నారు.



బైపాస్ వద్ద కూరగాయాల లోడు దింపిన రైతులు

**కోర్టులను ఆశ్రయించిన వైనం**

నగరపాలక సంస్థ అధికారులు మమ్మల్ని బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని కోర్టును ఆశ్రయించడంతో కొత్త లీజుదారులు ఎంత అయితే పాడుకున్నారో ఆ అద్దె ప్రతిపాదికన పాత లీజుదారులే రెండు నెలలు పాటు వ్యాపారం నిర్వహించుకోవాలని చెబుతూ స్టే ఇచ్చిందని సమాచారం. అయితే అంతాంత అద్దెలు పెట్టి వ్యాపారం చేయలేమని బైపాస్ వద్ద ఉన్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో వ్యాపారం నిర్వహించుకుంటున్నారు. సదరు కాంప్లెక్స్‌కు పర్మిషన్ ఇప్పించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. నేడు కోర్టును విచారణకు వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యాపారస్తులు చెప్పుకుంటున్నారు.

> **దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తాం**
>
> అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో మార్కెట్ నిర్వహణకు పలు శాఖల అనుమతులు తప్పనిసరి. వారు దరఖాస్తు చేసుకుంటే వీలైనంత త్వరగా అనుమతులు ఇప్పించే ప్రయత్నాలు చేస్తాం.
>
> – పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్

# పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**కమిషనర్ పులి శ్రీనివాసులు**



పనులపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బృందావన్ గార్డెన్స్, పెదపలకలూరు రోడ్డు, నెహ్రూనగర్ ప్రాంతాలలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు సమర్థంగా పర్యవేక్షణ చేయాలన్నారు. బృందావన్ గార్డెన్స్ సర్కిల్ ఆఫీస్ దగ్గర మురుగు నీరు పారుదలకు అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నెహ్రూనగర్‌లో పలు చోట్ల డ్రెయిన్ వాటర్ రోడ్లపైకి రావడంతో, వెంటనే డ్రెయిన్ వాటర్‌ను బెయిల్ చేయాలని, చెత్త కుప్పలు రోడ్లపై పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ట్రాన్సిట్ పాయింట్‌కు తరలించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ప్రజలు వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులకు అందజేసే సమయంలో తడి పొడి చెత్తలుగా విభజించి అందజేయాలన్నారు. ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు తడి పొడి వ్యర్థాల వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు.

# దళితులకు అండగా ఎస్సీ, ఎస్టీ కమిషన్

**తెలంగాణ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటయ్య

నెహ్రూనగర్: అన్ని విషయాల్లో దళితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) ఆధ్వర్యంలో చుండూరు పల్లెవీరుడు కొమ్మెర్ల అనిల్‌కుమార్ సంస్మరణ సభ బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించారు. వెంకటయ్య మాట్లాడుతూ చట్టాల అమలులో అగ్రవర్ణ రాజకీయ నాయకులు ఆటంకంగా నిలుస్తున్నారని ఆరోపించారు. విద్య, హక్కుల పరిరక్షణ కోసం, సబ్ ప్లాన్ నిధులు ఉపయోగించడం కోసం, బాధిత కుటుంబాలకు ఆదుకోవడం కోసం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో అగ్రకుల ఉన్మాదులు ప్రైవేటు సైన్యాలుగా ఏర్పాటై ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో దళితులపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ దళితులంతా సంఘటితంగా పోరాటాలు చేస్తానే దళితులపై దాడులను అరికట్టగలమన్నారు. ఆనంతరం బక్కి వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మేళం భాగ్యరావు, తాటిపర్తి బాలస్వామి, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్, ఏసీ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గురవయ్య, రిటైర్డ్ డీఎస్పీ కె.రవికుమార్, మేడికొండ సునీల్ పాల్గొన్నారు.

# 15న ఆటో కార్మికుల ఆందోళన

**సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్**



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి అరుణ్‌కుమార్

లక్ష్మీపురం: ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 15వ తేదీ ఆందోళన నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లు తమ కుటుంబాల పోషణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పేరుతో సభలు నిర్వహిస్తున్న నేతలు ఆటో కార్మికుల జీవన స్థితిగతుల గురించి ఒక్క మాట కూడా ప్రస్తావించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఆటో కార్మికులకు ఉపశమన చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు రుణభారం, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతోనే ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇక ఉచిత బస్సు సౌకర్యం వలన ప్రయాణికులు తగ్గిపోవడంతో వారి పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15న కలెక్టర్ కార్యాలయం వద్ద జరగబోయే ధర్నాలో ఆటో కార్మికులు హాజరు కావాలని కోరారు. ఆటో యూనియన్ నగర అధ్యక్షుడు కూరాకుల రాంప్రసాద్, సహాయ కార్యదర్శి ఎండీ బాబర్ పాల్గొన్నారు.

### ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ 7వ లైనులోని ఆక్స్‌ఫర్డ్ హై స్కూల్‌లో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జీవితమనేది చాలా అమూల్యమైనదని.. ఎటువంటి ఆటుపోటులకు లోనైన తట్టుకుని నిలబడాలని సూచించారు. విద్యార్థులంతా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.సుజాత, ఫౌండేషన్ కోర్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ డి.చంద్రికరెడ్డి మాట్లాడుతూ మనలో పాజిటివ్ ఎమోషన్స్, మన బిహేవియర్, పాజిటీవ్ యాటిట్యూడ్స్ సరిగా ఉన్నాయా..లేదా అని మనకు మనమే సెల్ఫ్ చెక్ చేసుకోవాలని సూచించారు.

# రేపు బీసీ సంక్షేమ సంఘం నిరసన ర్యాలీ

నెహ్రూనగర్: చట్ట సభల్లో ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం 41 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌తో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం గత మూడు దశాబ్దాలుగా దేశంలోని ఓబీసీ సంఘాలన్నింటితో కలిసి, ఓబీసీలకు చట్టసభల్లోను, స్థానిక సంస్థలలోను జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు అమలు జరపాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. బీసీ కుల గణన , బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని ఇతర డిమాండ్లతో 12న ఉదయం 10 గంటలకు హిందూ కాలేజీ వద్ద ఉన్న పూలే సెంటర్ నుంచి గుంటూరు కలెక్టరేట్ వరకు జరిగే నిరసన కార్యక్రమంలో బీసీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

**బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి**

బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు డిమాండ్ చేశారు. బుధవారం అరండల్‌పేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడున్నర దశాబ్దాలుగా బీసీలకు ఏ రంగంలోనూ జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించకపోవడంతో బీసీలు ఇంకా వెనకబడే ఉన్నారన్నారు. ఇంత వరకు బీసీలకు జరిగిన అన్యాయం మరెవ్వరికీ జరగలేదని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఈ అన్యాయాలను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి బీసీ నాయకత్వం ఐక్యతతో రాజ్యాధికార సాధనకై అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బీసీ వేదిక నాయకులు లలిత్ ప్రజాపతి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో మాత్రమే కాదు, ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లోనూ ఉన్నత విద్యా సంస్థల్లోనూ, ఇంతవరకు బీసీల అవకాశాల్ని వారికి తక్కనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యా, ఉద్యోగాలలో క్రిమిలేయర్ వలన చాలా మంది బీసీలు విద్యా, ఉద్యోగాలలో బీసీ రిజర్వేషన్స్ అందుకోలేకపోతున్నారన్నారు. బీసీ వేదిక రాష్ట్ర నాయకులు బాబ్జీ నంద మాట్లాడుతూ బీసీలంతా అధికారం సాధిద్దాం సమష్టిగా పంచుకొందాం అనే నినాదాన్ని గ్రామ స్థాయి నుంచి తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

### ఆర్‌వీఆర్‌జేసీలో నేత్రదాన దినోత్సవం

గుంటూరు రూరల్: నేత్రదానంతో అంధకారంలో ఉన్న జీవితాలకు వెలుగును ప్రసాదించవచ్చని కంటి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ షఫీల తెలిపారు. బుధవారం మండలంలోని చౌడవరం ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ నేత్రదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర కంటి ఆసుపత్రి వైద్యుల బృందం విద్యార్థులకు నేత్ర సంబంధిత రుగ్మతలు, కంటి సంరక్షణ పద్ధతులు, ఆరోగ్యకరమైన అలవాట్లపై సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# సచివాలయ కార్యదర్శులు సమయపాలన పాటించాలి



రికార్డ్స్‌ను పరిశీలిస్తున్న డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

నెహ్రూనగర్: నగరంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయ పాలన పాటిస్తూ, కార్యాలయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలోని 39, 40 వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత సచివాలయంలోని హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి, పని వేళల్లో ఆఫీస్ పని మీద బయటకు వెళ్ళినప్పుడు కార్యదర్శులు తప్పనిసరిగా మూవ్మెంట్ రిజిస్టర్‌లో నోట్ చేయాలన్నారు. సచివాలయంలో నిర్వహించాల్సిన రిజిస్టర్లను అసంపూర్తిగా నిర్వహించడంపై కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సదరు రిజిస్టర్లను సరిగా నిర్వహించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 39వ సచివాలయంలో అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు లేకపోవుట గమనించి, సదరు సచివాలయంలో ఇన్‌చార్జి అడ్మిన్, ఎడ్యుకేషన్ కార్యదర్శులను నియమించాలని మేనేజర్‌ను ఆదేశించారు.

# కాణిపాకంలో మెరిసిన నృత్యకారిణులు




నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

గుంటూరు ఎడ్యుకేషన్: చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహిస్తున్న శ్రీవరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల్లో గుంటూరుకు చెందిన నృత్య కారిణులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గుంటూరుకు చెందిన అను డ్యాన్స్ అకాడమీకి చెందిన 20 మంది నృత్యకారిణుల బృందం ఈనెల 8వ తేదీన కాణిపాకంలో ప్రదర్శన ఇచ్చారు. నాట్య గురువు అను శేఖర్ పర్యవేక్షణలో నృత్య కారిణులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, భక్తిగీతాలకు వేసిన నృత్యాలతో భక్తులు, ఆహుతులు మంత్రముగ్ధులయ్యారు. దేవ శ్రీగణేషా, శ్రీనివాస కల్యాణం, రఘుకుల తిలకా రారా, నవదుర్గ, కాళింగ నర్తన, జనతా శబ్దం గీతాలకు ఇచ్చిన అద్భుతమైన పెర్‌ఫార్మన్స్‌తో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. నాట్య గురువు అను శేఖర్ మాట్లాడుతూ కాణిపాక వినాయకుని దేవస్థానంలో యేటా జరిగే బ్రహ్మోత్సవాల్లో గుంటూరు నుంచి వెళ్లి కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నృత్య కారిణులతో భక్తిభావాన్ని పెంపొందించే రీతిలో ప్రదర్శనలతో గుంటూరు ఖ్యాతి చాటుతున్నట్లు వివరించారు.

# మహిళా ధీరత్వానికి ప్రతీక ఐలమ్మ



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రజక జన సేవ నాయకులు



ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నెహ్రూనగర్: మహిళా ధీరత్వానికి ప్రతీక చిట్యాల ఐలమ్మ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిట్యాల ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని చంద్రమౌళినగర్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సాహసంతో పోరాడిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. భూమి, భుక్తి కోసం చరిత్ర సృష్టించి ఐలమ్మ పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో రజక సంఘాల నాయకులు గణేష్, సురేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..**

భూస్వామ్య వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించిన చిట్యాల ఐలమ్మ జీవితం ఆదర్శప్రాయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ తెలిపారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని చంద్రమౌళినగర్‌లోని ఆమె విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

### స్వదేశీ వస్త్రాలను ఆదరిద్దాం



నగరంపాలెం: మహిళల వస్త్ర వైభవానికి పట్టు వస్త్రాలు ప్రత్యేక ముద్రను సంతరించుకున్నాయని జీఎంసీ డెప్యూటీ మేయర్ సజీల అన్నారు. కేంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో రాజేంద్రనగర్ శుభం కన్వెన్షన్‌లో ఐదు రోజులపాటు జరగనున్న ఇండియన్‌సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పోను బుధవారం ప్రారంభించారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో నిర్వాహకులు, సెంట్రల్ సిల్క్ బోర్డు విశ్రాంత డీడీ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.పద్మశ్రీ, ఇండియన్స్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఎండీ వై.విజయ్‌కుమార్, బ్రాండ్ అంబాసిడర్ పి.దీపిక, సోషల్ మీడియా క్యాంపైనర్ జి.నందిని, పలు రాష్ట్రాల వీవర్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### డ్రగ్స్, ఈవ్‌టీజింగ్‌పై యువతకు అవగాహన




గుంటూరు రూరల్: మండలంలోని చల్లావారిపాలెం విక్టోరియా ఫార్మసీ కళాశాలలో బుధవారం యువజన సర్వీసుల శాఖ, సెప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్ అబ్యూసింగ్, సైబర్ సెక్యూరిటీ ఈవ్‌టీజింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నార్కోటిక్ విభాగం ఎస్ఐ ఎం.సునీల్ బాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత వారి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవటంతోపాటు జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. అనైతిక చర్యలకు పాల్పడటం ద్వారా సమాజంలో గౌరవాన్ని కోల్పోతారన్నారు. దీని వల్ల చట్టపరంగా శిక్షలు అనుభవిస్తారన్నారు. చెడు వ్యసనాలు మీ జీవితాలను నాశనం చేయటంతోపాటు మీ కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెడతాయన్నారు. సైబర్ సెల్ విభాగం సీఐ నిస్సార్‌బాషా మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం అందించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుకోకుండా ఎవరైనా సైబర్ నేరాలవల్ల ఇబ్బంది పడినట్టయితే టోల్ ఫ్రీ 1930 నంబర్‌కు సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బి.ఇన్నయ్య, ప్రిన్సిపాల్ టి.వినయ్, యువజన సర్వీసుల శాఖ, సెప్ మేనేజర్ బి.రాధిక, ఉపాధి కార్యాలయం సిబ్బంది మల్లేశ్వరి, వి.సాయిసాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

# పగలంతా ఉక్కపోత.. రాత్రి కుండపోత

నగరంపాలెం: నగరంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగర ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. కాస్తంత గాలి కూడా లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి కురిసిన కుండపోత వర్షానికి రహదారులు, వీధులు నీట మునిగాయి. అయితే రాత్రి తొమ్మిది గంటలకు మొదలైన వర్షం భారీగా కురిసింది. రాత్రి విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహన చోదకులు వానలో తడిసి ముద్దయ్యారు. రహదారుల వెంట చిరు వ్యాపారులు నిర్వర్తించే వారు వాన ధాటికి పరుగులు తీశారు. దీంతో దుకాణాలు ఎదుట ఉండిపోయారు. ఉరుములతో కూడిన పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.